ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 5 ఫిబ్రవరి 2024 | 5



నేడు కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి 'స్పందన'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: జగనన్నకు చెబుదాం.. జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం ఈ నెల 5వతేదీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్‌లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు, జిల్లా అధికారులు గమనించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు.

నిబంధనలకు.. తిలోదకాలు

- కాకినాడ రూరల్‌లో జోరుగా అక్రమ భవన నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



48వ డివిజన్ లక్ష్మీగణపతి వీధిలో ప్లాన్‌కి వ్యతిరేకంగా నిర్మించిన ఓ భవనం

సర్పవరం జంక్షన్(కాకినాడ), ఫిబ్రవరి 4: కాకినాడ స్మార్ట్‌సిటీకి సమాంతరంగా రూరల్ మండలం అభివృద్ధి చెందుతోంది. జిల్లాప్రధాన కేంద్రం కావడంతో ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు, విద్య, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, పోర్టులో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఉండడంతో జిల్లా నలుమూలలనుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. దీంతో కాకినాడ పరిసర ప్రాంతాలతోపాటు శివారు ప్రాంతాల్లో భూములు, స్థలాలకు మార్కెట్‌లో మంచి రేటు ఉంది. దీంతో రియల్టర్లు బహుళ అంతస్తుల భవనాలు విరివిగా నిర్మిస్తున్నారు. అపార్టుమెంట్లు నిర్మాణంలో నగరపాలక ప్లానింగ్ నిబంధనలకు లోబడి నిర్మాణాలు కొనసాగాల్సి ఉండగా, టౌన్‌ప్లానింగ్ అధికారుల ఉదాసీనవైఖరితో భవన నిర్మాణాలు, వ్యాపార సముదాయాలు, నివాస సముదాయాల నిర్మాణంలో ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అపార్టుమెంట్ చుట్టూ కనీసం మీటరు స్థలం చూపించాల్సి ఉండగా, అవేమీ పట్టనట్లు రోడ్డు, డ్రైనేజీ మీదకు వచ్చేసి నిర్మాణాలు సాగిస్తున్నా, వీటిపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు తూతూ మంత్రంగా వచ్చి నోటీసులిచ్చాం అంటూ మామూళ్లు తీసుకుని ఉదాసీనవైఖరి ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ రూరల్లో అక్రమ నిర్మాణాలు

కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో నగరపాలక సంస్థకు చెందిన 1, 2, 3, 48, 49, 50 డివిజన్లు ఉన్నాయి. 47వ డివిజన్‌లో కొంతమేర విస్తీర్ణం ఉంది. కార్పొరేషన్‌లో విలీనం జరిగి ఎన్నికలు నిర్వహించకుండా 42వ డివిజన్ ఉంది. స్మార్ట్‌సిటీకి సమాంతరంగా ఈ డివిజన్లు అభివృద్ధి చెందడంతో సిటీలో ప్లాట్లు కొనుగోలు చేయలేని వారు కాకినాడ చుట్టుపక్కల గల ఏడుడివిజన్లలో కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు. 49వ డివిజన్ పరిధిలో అధికారిక కట్టడాల కంటే అనధికారిక కట్టడాలే అనేకం ఉన్నాయి. ఇక్కడ టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా నిర్మించిన భవనాలు, అపార్టుమెంట్లు కోకొల్లలు ఉన్నాయి. దీన్ని అవకాశంగా చేసుకున్న రియల్టర్లు, భవనయాజమానులు నగరపాలకసంస్థనుంచి అనుమతి పొందిన సమయంలో ప్లాన్ అప్రూవల్‌లో పొందుపరచిన నిబంధనలను పక్కన బెట్టి భవనానికి ఎటువంటి సెట్‌బేక్స్ విడిచిపెట్టకుండా సెల్లార్లు, పార్కింగ్ సౌకర్యం లేకుండా, భవనం నాలుగు పక్కలా కనీసం మీటరు ఖాళీ స్థలం విడిచిపెట్టకుండా నిబంధనలు అతిక్రమిస్తున్నారు.ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదం జరిగితే ఫైర్‌వెహికల్ రావడానికి కూడా వీలులేని విధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. భవనం ముందున్న రోడ్లు, డ్రైనేజీలను ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు చేస్తుంటే నోటీసులు ఇచ్చేశామని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో లోపాలను పరిశీలించడం, నిబంధనల ఉల్లంఘనలు, సరిచేయడం వంటి చర్యలు చేపట్టకుండా వదిలేయడంతో అక్రమ నిర్మాణాలు జోరందుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ఉదాహరణకు ఓ బహుళ అంతస్తు భవనం

48వడివిజన్ మధురానగర్ లక్ష్మీగణపతి వీధిలో ఓ బహుళ అంతస్తు భవననిర్మాణం చేపట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టాల ప్రకారం నిబంధనలకు లోబడి నిర్మాణం చేపట్టాలని ప్లాన్ అప్రూవల్ టైమ్‌లో నగరప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చారు. భవనం రోడ్డు పక్కన ఉండడంతో కచ్చితంగా రోడ్డుకు మీటరు లోపల నిర్మాణం చేపట్టాలని ఉంది. కనీసం అడుగు దూరం కూడా స్థలం వదలకుండా నిర్మాణం చేపట్టారు. భవనం చుట్టూ మీటరు ఖాళీస్థలం విడిచిపెట్టకుండా నిర్మాణం చేశారని, సిల్ట్, గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్‌కు అనుమతి పొందగా, అనధికారికంగా మరో ఫ్లోర్ నిర్మించడం విశేషం. భవన యాజమాని నిబంధనలు ఏమాత్రం పాటించకుండా ఇష్టానురీతిలో ఏకంగా డ్రైనేజీపై భవనానికి చెందిన ప్రహరీ నిర్మించడం విశేషం. అంతటితో ఆగకుండా వాహనాలు బయటకు వచ్చేందుకు డ్రైనేజీని ఆక్రమించి ప్లాట్‌ఫామ్ నిర్మించారు. మలుపులో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అక్రమ నిర్మాణం ఆపాలంటూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. యాజమానికి నోటీసు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకున్నారని వాపోయారు.

తూతూమంత్రంగా నోటీసులు

నగరపాలకసంస్థ పరిధిలో ప్రభుత్వం వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. ఒక్కో సచివాలయానికి ఓ రెగ్యులేషన్ కార్యదర్శిని నియమించారు. వీరంతా ఆయాప్రాంతాల పరిధిలో జరుగుతున్న అపార్టుమెంట్లు, వాణిజ్య, వ్యాపార సముదాయాల నిర్మాణాలను పరిశీలించి ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు, స్థలాల ఆక్రమణకు గురైతే వెంటనే గుర్తించి వీరంతా టౌన్‌ప్లానింగ్ అధికారులకు నివేదించాలి.అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే వాళ్లు అన్‌ఆథరైజ్డ్ నోటీసు (యూసీ) ఇచ్చేశాం. రెండోసారి ఇచ్చేశామంటూ భవన యాజమానికి ఇవ్వకుండా అక్కడున్న వాచ్‌మెన్ తదితరులకు ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు యథావిధిగా జరుగుతున్నాయి. ఉదాసీన వైఖరితో కాలక్షేపం చేయడంతో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరిగిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

కేటాయింపులు ఏవీ?

- రైల్వే బడ్జెట్‌లో మన ప్రాంతానికి కేటాయింపులపై అస్పష్టత

సామర్లకోట, ఫిబ్రవరి 4: కేంద్రంలో రైల్వేశాఖ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మన ప్రాంతానికి ఏమీ కేటాయించలేదని, రైలు ప్రయాణికులకు ఎంతమాత్రం మేలు చేకూర్చలేకపోయారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సాధారణ ప్రయాణికులకు ఎంతో మేలు కల్గించే సాధారణ భోగీలను 50శాతం తగ్గించడంతో రిజర్వేషన్ టిక్కెట్లు ఉన్న ప్రయాణికులు మినహా సాధారణ టిక్కెట్లు తీసుకుని ప్రయాణించే అవకాశాలు లేకపోయాయి. దీంతో ఇటీవలకాలంలో రైలు ప్రయాణాలపట్ల పలువురు విముఖత చూపుతున్నారు. ఇదే విషయాన్ని పలు దఫాలు పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు సైతం ప్రశ్నించినా రైల్వేశాఖనుంచి ఏమాత్రం స్పందన లేకపోయింది. పెరుగుతున్న రైలు ప్రయాణికుల అవసరాలకు తగిన రీతిలో మౌలిక సదుపాయాలు కలగజేయలేకపోయారు. ప్రధానంగా పారిశుధ్యం విషయంలో అవసరం మేరకు పారిశుధ్య సిబ్బందిని నియామకం చేయకపోవడం.. ఉన్న కొద్దిపాటి సిబ్బందితో మొత్తం స్టేషన్ ఆవరణలు పరిశుభ్రపరచలేకపోవడంతో సహజంగా పలు రైల్వేస్టేషన్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు తగిన రీతిలో టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయకపోవడం, ప్రైవేటైజేషన్ విధానంలోను ఏర్పాటు చేయకపోవడంవల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటువంటి మౌలిక సదుపాయాల మెరుగుకు కేంద్ర బడ్జెట్‌లో ఏమాత్రం నిధులు కేటాయించలేనట్లు తెలిసింది.

మూడో లైనే లేదు.. నాలుగో లైనా..

విజయవాడ-విశాఖ మధ్య రద్దీ తీవ్రతరంగా ఉంటుంది. సుదీర్ఘకాలంగా మూడో లైన్ ఏర్పాటు అవుతోందంటూ రైల్వే చెబుతూ వస్తోంది. మూడేళ్లుగా మూడోలైన్ ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియడంలేదు. కేంద్ర బడ్జెట్‌లో తాజాగా చేసిన ప్రకటన సారాంశం ప్రకారం విజయవాడ-విశాఖ మధ్య మూడో, నాలుగో లైన్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించడం అభినందనీయమే. అయినా కార్యాచరణ దాల్చేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ అదనపు లైన్లు అందుబాటులోకి వస్తే పశ్చిమబెంగాల్‌నుంచి దేశంలో దక్షిణ ప్రాంతాలకు సరుకు రవాణాతోబాటు, ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించడం సాధ్యమౌతుంది. విజయవాడ రైల్వేడివిజన్ పరిధిలో రూ.150కోట్లతో 15గూడ్స్ షెడ్‌లకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు కేటాయింపులు చేయడం జరిగింది. ఈ డివిజన్ పరిధిలో విజయవాడ తర్వాత అత్యధిక ఆదాయం సాధించిపెట్టే సామర్లకోట గూడ్స్ యార్డుకు ఎంతమేర నిధులు కేటాయిస్తారో స్పష్టత లోపించింది. దీంతో సామర్లకోట గూడ్స్‌యార్డు అబివృద్ధి నీటిమూటలేనా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అసంతృప్తిలో రైల్వే ఉద్యోగులు

కేంద్ర బడ్జెట్‌లో తమకు ఏదైనా తీపికబురు ఎదురౌతుందని ఆశించిన రైల్వే ఉద్యోగులకు తీవ్ర నిరాశే ఎదురైంది. ఓపీఎస్ విషయంలో ఎటువంటి ఊసూ లేకపోవడం, 8వ పేరివిజన్ కమిషన్ విషయంగా ఎటువంటి ప్రకటన చేయకపోవడం, ఇతర ప్రయోజనాలకు సంబంధించి కూడా ఎటువంటి చర్చ లేకపోవడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. రైల్వేలో ఖాళీలు, పెరిగిన రైళ్లకు అనుగుణంగా పెంచాల్సిన ఉద్యోగాల విషయంలో బడ్జెట్‌లో ప్రకటన లేకపోవడంపై కార్మిక సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. కనీసం ఎన్నికల ముందైనా తమ కష్టాలు తీరేలా వరాలు ప్రసాదిస్తారని భావించిన ఉద్యోగులకు తీవ్ర నిరాశే మిగిలింది. వరుసగా రెండో ఏడాదీ ఉద్యోగులకు మొండిచేయే మిగిలింది. రైల్వే పింక్ బుక్ వెలువడిన తర్వాత సునిశితంగా పరిశీలించి రైల్వేడివిజన్‌కు ఎన్ని కోట్లు కేటాయింపులు జరిగాయో తెలియాల్సి ఉంది.

మామిడాడలో ఐదుగురు పంచాయతీ వార్డు సభ్యులు వైసీపీకి రాజీనామా

- జ్యోతుల సమక్షంలో జగ్గంపేట మండలం కాండ్రేగల, కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి నుంచీ టీడీపీలో చేరిక



కాండ్రేగులలో జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నేతలు

జగ్గంపేట, ఫిబ్రవరి 4: జగ్గంపేట మండలం మామిడాడలో వైసీపీ పూర్తిగా ఖాళీ అయ్యే పరిస్థితి వచ్చింది. మొన్న దళితులు, నిన్న సర్పంచ్ కాగా ఆదివారం ఐదుగురు పంచాయతీ వార్డు సభ్యులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. మామిడాడ గ్రామ పంచాయతీ 4వ వార్డు సభ్యులు మద్దాల దుర్గబాబు ఆధ్వర్యంలో 6వ వార్డు సభ్యులు మళ్ల శ్రీను, ఐదో వార్డు సభ్యులు వెనుకటి గంగ 11వ సభ్యులు సూరంపూడి సత్తిబాబు, పదో వార్డు మెంబర్ పొన్నగంటి వీరబాబు, వైసీపీ నాయకులు కర్రీకృష్ణ, సూరిశెట్టి నానాజీ, కర్రీ చిన్న లోవరాజు, బుద్ద అప్పారావు తదితర 100 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వీరికి నెహ్రూ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. అనంతరం జనసైనికుల ఆధ్వర్యంలో నెహ్రూను ఘనంగా సత్కరించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ మామిడాడలో వైసీపీ ఖాళీ అవుతుందని, దళితులు, పంచాయతీ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఇలా ప్రతిరోజు టీడీపీలో చేరికలు పెరిగి పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. ఏలేరు కుడికాలువకు గత ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభిస్తే ఎన్నికలు వచ్చి ఆగిపోయిందన్నారు. గుమ్మలదొడ్డి సభలో సీఎం జగన్ రెడ్డి నిధులు కేటాయించనని ప్రకటించారని, తర్వాత వచ్చిన ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, రేఖ బుల్లిరాజు,వేగి రామకృష్ణ, సుంకవిల్లి రాజు,దాపర్తి సీతారామయ్య, మురళిరాజు, పాఠంశెట్టిబాబ్జి, జ్యోతులసత్యమూర్తి, ఈశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రహదారులను అభివృద్ధి చేయాలి

- శిథిల రహదారిపై గోడకట్టి నిరసన తెలిపిన టీడీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ
- ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురం నుంచి రమణయ్యపేట వరకు పాదయాత్ర
- తరలివచ్చిన టీడీపీ, జనసేన కార్యకర్తలు.



ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురంనుంచి టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి పాదయాత్ర చేస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: ప్రత్తిపాడు నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో ఆదివారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామం నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు 4కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి రమణయ్యపేట గ్రామం వద్ద శిథిల రహదారికి అడ్డంగా గోడ కట్టి వందలాదిమంది అనుచరులతో నిరసన చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా గోడ ఏర్పాటు చేయడంవల్ల ఏలేశ్వరం, నర్సీపట్నం ఆర్అండ్‌బీ రహదారిపై 4కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.ఈసందర్భంగా ఆందోళనకు నాయకత్వం వహించిన సత్యప్రభ మాట్లాడుతూ ఏలేశ్వరం, నర్సీపట్నం రహదారితోపాటు శంఖవరం,పెద్దమల్లాపురంతోపాటు అనేక రహదారులు శిథిలమై అధ్వానంగా మారినా ప్రభుత్వం పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ రహదారి నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదలబోమని ఆమె భీష్మించి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఏలేశ్వరం పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఆర్అండ్‌బీశాఖకు చెందిన అధికారులు ఫోన్‌లో సత్యప్రభతో మాట్లాడారు. పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోవడంతో మహిళలు, చిన్నపిల్లలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి ఆందోళన విరమించారు. ప్రభుత్వం వెంటనే రహదారి నిర్మానం చేపట్టాలని, లేనిపక్షంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఈ రహదారి నిర్మిస్తామని తెలిపారు. ఆందోళనలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జ్యోతుల పెదబాబు, కొమ్ముల కన్నబాబు, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమళ్ల రాజ్యలక్ష్మి, నాయకులు సూది బూరయ్య, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి, బస్వాప్రసాద్, చందువోలు రాజా, చిక్కాల లక్ష్మణరావు, బూర్లు బాసు, కొండబాబు, జి.సత్యనారాయణ, అలార్కరాజు, పలివెల శ్రీనివాస్, ఒనుం మంగ, ఉల్లి వీరభద్రరావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


- యూటీఎఫ్ నాయకుల పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ రాజకీయ అజెండా కావాలని ఆకాంక్షిస్తూ రూపొందించిన పోస్టర్‌ను యూటీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. జిల్లా యూటీఎఫ్ కార్యాలయం టీచర్స్ హోంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదన్నారు. జీపీఎస్‌వల్ల ఎటువంటి ఉపయోగం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓపీఎస్ సాధనే అజెండా చేయాలని, అన్ని రాజకీయ పక్షాల నాయకులను మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో కలుస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నింటినీ సంఘటితపరచి ఓపీఎస్ సాధనే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారావు, జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, ప్రధాన కార్యదర్శి టి.సీతారామయ్య, కుటుంబ సంక్షేమ పథకం కార్యదర్శి ఎన్.గోవిందరాజు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్రపెండలం క్రషింగ్ సీజన్ ప్రారంభం



- సాంకేతిక అవరోధాలతో ఆలస్యంగా సీజన్ ప్రారంభం
- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- గిట్టుబాటు ధర లేనట్లే

సామర్లకోట, ఫిబ్రవరి 4: జిల్లాలో సగ్గుబియ్యం మిల్లులో కర్రపెండలం దుంప క్రషింగ్ సీజన్‌ను మిల్లర్లు జిల్లాలో 10 సగ్గుబియ్యం మిల్లుల్లో దుంప క్రషింగ్ సీజన్‌ను ప్రారం భించారు. ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ నిర్దేశించిన ప్రకారం గత నెలాఖరునుంచే దుంప క్రషింగ్ సీజన్‌ను ప్రారంభించాలని అనుకున్నా మిల్లులో కొన్ని సాంకేతిక అవరోధాలను సరిదిద్దడంలో కొంతమేర జాప్యం జరిగి నట్లు సమాచారం. ఈ కారణంగానే ఫిబ్రవరి మొదటి వారంలో రెండురోజులుగా వరుసగా అన్నిమిల్లుల్లో సీజన్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.

కర్రపెండలం దుంప ఆధారంగా సగ్గుబియ్యం తయారు చేసే మిల్లులు రాష్ట్రంలో కేవలం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అందునా సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోనే కేంద్రీకృతమై ఉన్నందున జిల్లాలో మెట్టప్రాంతాల్లోను, ఏజెన్సీ మండలాల్లోను సాగవుతున్న కర్రపెండలం దుంప మొత్తం సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని సగ్గుబియ్యం మిల్లులకే సరఫరా అవుతుంటాయి. జిల్లావ్యాప్తంగా 28 సగ్గుబియ్యం మిల్లులు ఉన్నప్పటికీ ఈఏడాది 11 మిల్లుల్లోనే దుంప క్రషింగ్ జరిపేందుకు సన్నాహాలు చేశామని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసే కర్రపెండలం దుంప పుట్టికి(225 కిలోలు) రూ.1,600 ఇచ్చే అవకాశాలు ఉన్నట్టు చెప్పారు. గతేడాది కొనుగోలు చేసిన ధరకంటే రూ.250 అదనం అవుతుందని చెప్పారు. సగ్గుబియ్యం తయారీకి ఉత్పాదకా వ్యయం పెరుగుతున్నా సేలం మార్కెట్‌లో సగ్గుబియ్యం బస్తాకు రూ.4,000కు మించకపోవడంవల్ల దుంపకు అంతకుమించి ధర చెల్లించలేకపోతున్నట్లు మిల్లర్లు తెలిపారు. ఈ ఏడాది కర్రపెండలం దుంప సాగుకు సకాలంలో వర్షాలు కురవకపోవడంవల్ల భూమిలో దుంప ఎదుగుదల లోపించిందని, తదనంతరం కురిసిన భారీ వర్షాలకు ఉన్న దుంపలు నీటి నిల్వల వల్ల దుంపలు ఊటబారి కుళ్లిపోయాయని దుంప సాగు రైతులు వాపోయారు. దుంపలు ఆశించినంత రీతిలో ఉరమలేదని తెలిపారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 12వేల ఎకరాల్లోపు మాత్రమే దుంప సాగుచేశారని మిల్లర్ల ద్వారా సమాచారం. రైతులకు ప్రైవేట్ అప్పులుగా పంట పెట్టుబడులు మిల్లర్లు మాత్రమే ఇస్తున్నందున వ్యవసాయ, ఉద్యానవనశాఖల సర్వేకంటే మిన్నగా దుంపసాగు విస్తీర్ణం సర్వే సమాచారం మిల్లర్లకే ఎక్కువగా తెలుస్తోంది. కాగా దిగుబడి ఎకరాకు 25 పుట్లు అందే అవకాశాలు ఉన్నాయని దుంప రైతు బండే కొండలరావు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంవల్ల, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించనందున రైతులు నష్టపోయే ప్రమాదమేగాక దుంప సాగు ఉనికి కనుమరుగయ్యే అవకాశాలున్నాయని వాపోయారు.

సాదాసీదాగా జడ్పీ మీటింగ్

- అంతా మొక్కుబడే!
- అజెండా అంశాలపై చర్చ లేకుండా మమ..
- ఉమ్మడి జడ్పీ సమావేశం జరిగిన తీరు ఇది..
- ఎమ్మెల్యేలు రాక నామమాత్రంగానే..

- 7లో

లోవలో భక్తుల కోలాహలం

- 7లో

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు

- 7లో

క్షేత్రస్థాయిలో టీకాలు ఎక్కడ?

- పశువులకు పూర్తిస్థాయిలో అందని గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు



గండేపల్లి, ఫిబ్రవరి 4: మాటల్లో పూర్తిస్థాయిలో టీకాలు వేశామని వెటర్నరీ అధికారులు చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో గ్రామాల్లో టీకాలు వేయిడంలేదని పలువురు పాడిరైతులు అంటున్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా పశువులకు సంవత్సరానికి రెండుసార్లు టీకాలు వేయాల్సి ఉంది. ఈ టీకాలు వేయడంవల్ల పశువుల కాళ్లకు పుండ్లు పడకుండా ఉండడం, నీరసించకుండా, పలువ్యాధులు రాకుండా ఈటీకాలు ఉపయోగపడతాయని పాడిరైతులు చెబుతున్నారు. ఈటీకాలు గ్రామస్థాయిలో పశువులకు పూర్తిస్థాయిలో అందడం లేదంటున్నారు. వెటర్నరీ అధికారులు టీకాలు వేసినట్లు ఆన్‌లైన్‌లో చూపించి క్షేత్రస్థాయి గ్రామాల్లో పూర్తిస్థాయిలో అందడం లేదని ఆరోపణలున్నాయి. యానిమల్స్ హెల్త్‌కార్డులు కూడా అందడం లేదని పాడి తెలుపుతున్నారు. హెల్త్ కార్డులు అందకపోతే ప్రభుత్వంనుంచి వచ్చే సదుపాయాలు రావడం లేదంటున్నారు. సచివాలయ, వెటర్నరీ సిబ్బంది సేవలు కూడా అంతంతమాత్రంగా ఉన్నాయని పలువురు రైతులు అంటున్నారు. సచివాలయ సిబ్బంది విధులకు వచ్చేసరికి పశువులు మేతలకు వెళ్తున్నాయి. తిరిగి పశువులశాలకు వచ్చేసరికి సిబ్బంది అందుబాటులో ఉంచడం లేదంటున్నారు. అత్యవసర సేవలకు ఉపయోగించే 1166 అంబులెన్స్ సేవలు కూడా అంతంతమాత్రమే అంటున్నారు. అంబులెన్స్‌లో కిందిస్థాయి సిబ్బంది తప్ప అనుభవం ఉన్న వైద్యులు సరిగా ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మెట్టప్రాంతంలో ఎక్కువగా రైతులు పాడి మీద ఆధారపడి జీవిస్తున్నారు. సచివాలయ వెటర్నరీ సిబ్బంది అందుబాటులో ఉండాలని పలువురు రైతులు కోరుతున్నారు. గ్రామాల్లో పశువులకు టీకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

సాదాసీదాగా జడ్పీ మీటింగ్



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్



సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు

అంతా మొక్కుబడే!

అజెండా అంశాలపై చర్చ లేకుండా మమ..

ఉమ్మడి జడ్పీ సమావేశం జరిగిన తీరు ఇది..

ఎమ్మెల్యేలు రాక నామమాత్రంగానే..

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: అంతా మొక్కుబడే.. అజెండా అంశాలపై చర్చ లేకుండానే మమ అనిపించారు.. ఎమ్మెల్యేలు రాకపోవడంతో సాదాసీదాగా జరిగిన చర్చ.. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. రానున్న వేసవిలో సాగునీటి, తాగునీటి ఎద్దడిపై కొందరు జడ్పీటీసీలు చర్చించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీత, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా అతిథులుగా విచ్చేశారు.

రెండున్నరేళ్లు పూర్తి

మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రానున్న వేసవిలో సాగు, తాగునీటికి రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను కోరారు. వేసవిలో తాగునీటి కార్యాచరణపై ఎంపీ గీత, రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడారు. జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా ప్రగతి సాధన అంశాల్లో తమ వంతు కృషి చేస్తూ జడ్పీ పాలక మండలి రెండున్నరేళ్ల కాలం విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. ఇందుకు అన్ని విధాలా కృషి చేసిన సభ్యులు, సహకరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపీలు వంగా గీత, బోస్

2024-25 అంచనా బడ్జెట్ ఆమోదం

అనంతరం 2023-24 సంవత్సరానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను చర్చ, ఆమోదం కోసం సభ ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు వివిధ పద్దుల కింద రూ.883.34 కోట్ల ఆదాయం, రూ.882.79కోట్ల వ్యయం అంచనాలుగా రూ.55లక్షల మిగులుతో ప్రస్తుత 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలను, రూ.886.95కోట్ల ఆదాయం, రూ.886.33కోట్ల వ్యయం అంచనాలతో రానున్న 2024-25 సంవత్సరానికి రూ.62 లక్షల మిగులుతో అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి పద్దుల వారీగా చదివి వినిపించారు.

వివిధ అంశాలపై సమీక్ష

అజెండాలోని వివిధ అంశాలపై సభ్యులు సమీక్షించారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టిన ముందస్తు కార్యాచరణ గురించి సభ్యులు అడగ్గా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరిస్తూ మూడు జిల్లాల పరిధిలో అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో నింపగలమని తెలిపారు. తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని వివరించారు. రబీ పంటలకు అవసరమైన విత్తనాలకు కొరత లేదని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో అమలవుతున్న పనులను ఆ శాఖ అధికారులు తెలియజేశారు. సమావేశంలో సభ్యులు సూచించిన అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఉన్నత పదవులకు జడ్పీ వేదిక

రాజకీయాల్లో ఉన్నత పదవులు అధిరోహించేందుకు జడ్పీ వేదిక అని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. తాను, ఎంపీ గీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ వేదికగా ప్రజాసేవలోకి వచ్చామన్నారు. తమలాగే ప్రస్తుత పాలకమండలిలోని సభ్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న పథకాల లబ్ధి అందరికీ అందేలా కృషి చేయాలని సభ్యులను కోరారు. రాబోయే ఎన్నికల్లో ఈ వేదిక మీద తాను, ఎంపీ, జడ్పీ చైర్మన్ కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పోటీ చేయనున్నామన్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్య, కోనసీమ జిల్లా జేసీ నూపూర్ అజయ్, తూర్పుగోదావరి జిల్లా జేసీ తేజ్‌భరత్, జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న జనం

కన్నాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి పులి ప్రవేశం

గోపాలపురం, ఫిబ్రవరి 4: కొన్ని రోజులుగా పెద్దపులి సంచారంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతూ, కంటి మీద కునుకు లేకుండా ఉన్న గోపాలపురం మండల ప్రజలు పెద్దపులి కన్నాపురం రిజర్వ్ ఫారెస్ట్‌కు ప్రవేశించిందన్న వార్తతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కరగపాడు అటవీ ప్రాంతాన్ని దాటి బుట్టాయిగూడెం మండలం లక్ష్మీపురం వద్ద ఒక ఆవుపై దాడి చేసి చంపిన పెద్దపులి అనంతరం కన్నాపురం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్టు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



వివరాలు చెబుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలులో చట్ట విరుద్ధంగా తీసుకొస్తున్న తెలంగాణ మద్యం సీసాలను ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ విజయ్‌శంకర్ వివరాల ప్రకారం.. ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో భాగంగా జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు పర్యవేక్షణలో రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆర్పీఎస్ఐ కె.మావుళ్లు తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం, బంగారం, నగదు అక్రమ రవాణాపై దృష్టి సారించారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి రైలులో రాజమహేంద్రవరం వచ్చిన రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందిన వాసంశెట్టి ధనరాజ్ లగేజీ బ్యాగ్‌ని తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి తీసుకొస్తున్న 6 మద్యం ఫుల్ బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ధనరాజ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

ఫైల్ సిద్ధం చేసిన అధికారులు

అన్నవరం, ఫిబ్రవరి 4: అన్నవరం దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇతర క్యాడర్‌లలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అంతర్గత బదిలీలు చేపట్టేందుకు పరిపాలన విభాగ అధికారులు దస్త్రాలను సిద్ధం చేశారు. ప్రతి విభాగ ఉద్యోగిని మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీ చేయాలనే కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు అంతర్గత బదిలీలు పూర్తికాగా మిగిలిన సిబ్బందిని ఒకట్రెండురోజుల్లో బదిలీ చేయనున్నారు. సోమవారం ఈ దస్త్రంపై ఈవో రామచంద్రమోహన్ సంతకం చేయనున్నట్లు ప్రచారం జరుగుతుంది.

నేడు శంఖు, చక్ర, నామాలు ప్రారంభం

అన్నవరం దేవస్థానంలో సుమారు 70 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీపై ఏర్పాటుచేసిన శంఖు, చక్ర, నామాలను సోమవారం ప్రారంభించనున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ట్రయిల్ రన్ నిర్వహించినట్లు చెప్పారు. 42 అడుగులు పొడవు, 90 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేశామన్నారు. ఈ శంఖు, చక్ర, నామాల వెలుగు సముద్రతీర ప్రాంతానికి కనిపిస్తుందని, జాతీయ రహదారిపై, రైలులో ప్రయాణించే ప్రయాణికులకు రాత్రి సమయంలో అన్నవరం చేరుకున్నామనే భావన కలుగుతుందన్నారు.

లోవలో భక్తుల కోలాహలం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



సహపంక్తి భోజనాలు

తలుపులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుని రూరల్, ఫిబ్రవరి 4: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవ్యంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ అమ్మవారి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తల్లి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్‌లు కిక్కిరిసాయి. అమ్మవారిని భక్తులు దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం సమకూర్చిన వంట షెడ్‌లతో పాటు ఆలయ వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు చేశారు. ఆదివారం ఒక్క రోజే లోవకు తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.4.66 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం



రంపచోడవరం, ఫిబ్రవరి 4: భూపతిపాలెం రిజర్వాయర్‌లో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆత్మహత్యకు పాల్పడిందా లేక ఎవరైన హత్య చేసి రిజర్వాయర్‌లో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెంబర్లు 9440900762, 9381483283కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

తక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలా?

ఇది నిరుద్యోగులను మోసగించడమే

ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



పోటీ పరీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వం తన పదవీకాలం చివరిలో అతితక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలు చేయడం నిరుద్యోగులను మోసం చేయడమే అని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) అన్నారు. ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డీఎస్సీ, గ్రూప్స్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో గ్రూప్స్, డీవైఈవో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వీరేశలింగం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఐవీ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ఇస్తామని, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందన్నారు. అభ్యర్థుల వయో పరిమితి పెంచడానికి చర్యలు తీసుకోవాలని, గ్రూప్స్, డీఎస్సీలో మరిన్ని పోస్టులు పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పోటీ పరీక్షలపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ పోటీ పరీక్షలకు, అకడమిక్ పరీక్షలకు మధ్య ఉన్న తేడాను గమనించాలని సూచించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచించిన భారత సమాజం అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఐవీ, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ఆవిష్కరించారు. సదస్సులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

పంట సాగు కోసం అప్పుల పాలై..

● భార్యాభర్తల మధ్య గొడవ ● పురుగుల మందు తాగి భర్త మృతి



ఎటపాక, ఫిబ్రవరి 4: పంటల సాగు కోసం చేసిన అప్పుల విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగి... చివరకు క్షణికావేశంలో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎటపాక మండలం, రాంగోపాలపురం పంచాయతీ నర్సింగ్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొంది కామేశ్వరరావు(39) గత నాలుగేళ్లుగా అప్పులు చేస్తూ వ్యవసాయం చేస్తున్నాడు. గత నాలుగేళ్ల నుంచి పంటల్లో నష్టం రావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈఏడాది మరలా అప్పులు చేసి, మిర్చి, పత్తి, వరి సాగు చేశాడు. అయితే ఈసారి కూడా తెగుళ్లు, తుఫాన్ ప్రభావంతో పంట నష్టం వాటిల్లింది. దాంతో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య అప్పుల విషయంలో వివాదం జరిగింది. దాంతో కామేశ్వరరావు కొద్దిసేపటికి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాధ, కూతురు నందిత్య, కొడుకు సాద్విక్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు వద్ద నున్న శ్రీ గౌతమీ వ్యాయామ కళాశాల ఆవరణలో 15వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. జాంపేట కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ బొమ్మన జయకుమార్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె మధు, బిగ్ వింగ్ ఎండీ బులి వెంకటరావు, ప్రవీణ్ నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిస్టర్ ఇండియా రామాంజనేయులును సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో నిర్వహించే సౌత్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీలకు, మార్చి 15, 16, 17 తేదీల్లో తిరుచూర్‌లో జరిగే ఆలిండియా పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా వెళతారని పేర్కొన్నారు.

ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

యూపీఈఐఎఫ్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ అన్నారు. ఈ మేరకు పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కాకినాడలో యూపీఈఐఎఫ్ కార్యనిర్వాహక సభ్యులను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్ మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని, సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తామని ప్రకటించారు. దీంతో ఫెడరేషన్ లీగల్ అడ్వైజర్, కార్యనిర్వాహక సభ్యులకు పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు రిఫరీలుగా ఎంపిక

రామచంద్రపురం, ఫిబ్రవరి 4: ఈ నెల 7 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో గల జాదవ్ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంటర్నేషనల్ రిఫరీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎన్.గిరివెంకటరమణ, బి.కె.రత్నం, వై.అంజనీకుమార్ ఎంపికైనట్లు కోనసీమ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి తెలిపారు. వారిని వైజాగ్ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు ఆనందబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అభినందించారు.

బెండమూర్లంకలో 'శశివదనే' షూటింగ్



అల్లవరం, ఫిబ్రవరి 4: గౌరీనాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి నిర్మాణ సారథ్యంలో ఉబ్బన సాయిమోహన్ దర్శకత్వంలో 'శశివదనే' సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణతో బెండమూర్లంకలో షూటింగ్ సందడి నెలకొంది. పలాస ఫేమ్ రక్షిత్ హీరోగా, కోమలి ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తుండగా వారిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో రక్షిత్, తమిళ నటుడు శ్రీమాన్, సుబ్రహ్మణ్యం, నాయుడులపైనా కొన్ని దృశ్యాలు తీశారు. కెమెరామెన్‌గా శ్రీసాయికుమార్ దారా, మ్యూజిక్ డైరెక్టర్‌గా చరవణ వాసుదేవాన్ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని నిర్మాత తేజ చెప్పారు.



వెంకన్న ఒక్కరోజు ఆదాయం

రూ.2.89 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4: కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,89,111 లభించినట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

భీమేశ్వరాలయానికి విదేశీ భక్తులు



ఆలయంలో విదేశీ భక్తులు

సామర్లకోట, ఫిబ్రవరి 4: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం ఇటలీ దేశానికి చెందిన లూయిజా కుటుంబానికి చెందిన నలుగురు విదేశీ భక్తులు స్వామివారిని, బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిజా విలేకరులతో మాట్లాడుతూ తమ కుటుంబం ఇటలీలో ప్రముఖ ఆధ్యాత్మిక కుటుంబంగా పేర్గాంచిందని తాము చరిత్ర అధ్యయనం చేస్తూ పంచారామాల విశిష్టత గురించి తెలుసుకున్నామన్నారు. పంచారామాలలో సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ఎంతో గొప్పదని తాము చదివిన చరిత్రను స్వయంగా వీక్షించి తన్మయత్వం చెందామని చెప్పారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళా సంపదను చూసి వాటి వద్ద నిల్చుని ఫొటోలు తీసుకునేందుకు అత్యంత ఉత్సాహం కనబర్చారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

సీనియర్స్‌లో గుమ్మిలేరు, జూనియర్స్‌లో జమ్మిగొల్లేపల్లి విజేతలు



పరుగులు తీస్తున్న ఎద్దులు

సామర్లకోట, ఫిబ్రవరి 4: కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామభీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉండూరు రైల్వేగేట్-ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం వందలాది మంది రైతులు, పశు పోషకుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలకు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ప్రముఖ వ్యాపారవేత్త చందలాడ పద్మరాజు (బాబ్జీ) హాజరయ్యారు. నిర్ణీత దూరాన్ని తాకి తిరిగి వచ్చేందుకుగాను నిర్వహించిన ఈ పోటీలలో జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరాశ్రుతి చౌదరి ఎడ్లు 5.37.59 పాయింట్లతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా ద్వితీయ, తృతీయ స్థానాలను వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ సామర్లకోట ఎడ్లు 5.44.97 పాయింట్లతోనూ, కోరా శ్రుతి చౌదరి గుమ్మిలేరు ఎడ్లు 5.49.51 పాయింట్లతోనూ కైవసం చేసుకున్నాయి. అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని జమ్మిగొల్లేపల్లి నలజాల నరసింహారావు ఎడ్లు 4.13.72 పాయింట్లతోనూ, ద్వితీయ స్థానాన్ని మండపేట వేగుళ్ల నారయ్య చౌదరి ఎడ్లు 4.17.19 పాయింట్లతోనూ, తృతీయ స్థానాన్ని వెల్లుర్తి మొగలి ఏసుబాబు ఎడ్లు 4.23.13 పాయింట్లతోనూ కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, చందలాడ పద్మరాజు(బాబ్జీ) చేతులమీదుగా నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. సీనియర్స్ విభాగంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 9 జతల ఎడ్లు, జూనియర్స్ విభాగంలో 30 జతల ఎడ్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. పోటీల నిర్వాహకులుగా కాటూరి జానకీరామ్, కొండపల్లి కృష్ణమూర్తి, గోలి వెంకటఅప్పారావుచౌదరి, పైణ్ణి చిట్టియ్య, బిక్కిన శ్రీరంగనాయకులు, పైణ్ణి గౌరీచంద్, రామకృష్ణ వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి రైతులు, పశు పెంపకందారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సీనియర్స్ విభాగంలో విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

నేడు 'స్పందన, డయల్ యువర్ కమిషనర్'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 4: నగరపాలకసంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, 10:30గంటల నుంచి స్పందన కార్యక్రమాలు యథావిధిగా కొన సాగుతాయని కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలకసంస్థ కార్యాలయం 0884 2357800కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని,సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గవర్నర్ జోక్యం చేసుకోవాలి : ఎమ్మెల్సీ

సామర్లకోట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించి ముఖం చాటేయడాన్ని రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకోవాలని తాము శాసనమండలిలో డిమాండ్ చేశామని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు వెల్లడించారు. సామర్లకోట ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా యువత ఎదురుతెన్నులు చూడాల్సివచ్చిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జాబ్ క్యాలెండర్ ప్రకటించడం ప్రభుత్వ బూటకపు చర్య అన్నారు. రాష్ట్రంలో డీఎస్సీలో 50 వేల పోస్టులు ఖాళీగా ఉండే కేవలం 6వేల పోస్టులు ప్రకటించాడన్నారు. 2018 తర్వాత ఆరేళ్లవరకూ ఖాళీలుఉన్నాయన్నారు. చరిత్రలో 4 దశాబ్దాలుగా తాను ఎన్నడూ ఇటువంటి దుస్థితి చూడలేదన్నారు. డీఎస్సీ ప్రకటించలేదు, పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా పోస్టుల సంఖ్య పెంచాల్సి ఉండగా పోస్టులు రద్దు చేస్తున్నారు ఇక రాష్ట్రంలో విద్య ఎలా అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రశ్నించినవారిపై తప్పుడు కేసులు పెడుతూ యువతను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. యువతరం ఆశలు అడియాసలయ్యాయన్నారు. తనదైన శైలిలో పాటపాడి యువతను ఎమ్మెల్సీ అలరించారు.

స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలి

పిఠాపురం, ఫిబ్రవరి 4: పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం జగ్గయ్యచెరువు కాలనీలో భూమి ఆక్రమణలు, కబ్జాలు ఆపాలని, పేదలకు పట్టాలుగా ఇవ్వాలని డిమాండ్‌తో సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కాలనీలో ఖాళీగా ఉన్న 84సెంట్లు స్థలంలో ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టినా దానిని పీకేసి రాత్రికి రాత్రే కబ్జా చేసేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నించారని ఆరోపించారు. కబ్జాలకు పాల్పడిన వారిపై అధికారులు చర్యలు తీసుకోకుండా వారికి కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. ఖాళీగా ఉన్న భూములన్నింటిని గుర్తించి పేదలు, కార్మికులకు ఇళ్లస్థలాలుగా ఇవ్వాలని, టిడ్కో అపార్టమెంట్లును తక్షణం లబ్ధిదారులకు అప్పగించాలని సమావేశం తీర్మానించింది. మాలమహానాడు అధ్యక్షుడు దానం లాజర్‌బాబు, ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిల్లా చంద్రం, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ ఉన్నారు.

'దోషులను శిక్షించాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను లక్షల రూపాయలకు తాకట్టు పెట్టడం, ప్రజావసరాలకోసం భూమి అవసరమైతే ప్రైవేట్ భూములను కోట్లాది రూపాయల విలువైన బాండ్లు చెల్లించి సేకరించడం కాకినాడలో జరుగుతున్న అతి పెద్ద కుంభకోణమని, దీనిపై విచారణ చేసి దోషులను శిక్షించాలని బీజేపీ డిమాండ్ చేసింది. రామారావుపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ దుమ్ములపేటలో 9ఎకరాల భూసేకరణకు సంబంధించి రూ.500కోట్ల విలువైన టీడీఆర్ బాండ్ల విడుదలపై సమగ్ర విచారణ చేయించాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, గట్టి సత్యనారాయణ, ముత్తా నవీన్‌కృష్ణ, యెనిమిరెడ్డి మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న మాట్లాడారు. ఎల్‌కే అద్వానికి ప్రకటించిన భారతరత్న అవార్డును కించపరిచేలా మాట్లాడిన ఉండవల్లి అరుణ్‌కుమార్‌పై చర్య తీసుకోవాలని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క చాన్స్ ఇచ్చి ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ కో ఆర్డినేటర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు కోరారు. ఆదివారం ఒమ్మంగి, శరభవరం, గజ్జెనపూడి, చింతలూరు, వాకపల్లి, పోతులూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉమ్మిడి ఇంటింటా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 9న పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి తుని పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తునికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎం.సూర్యప్రకాశరావు, కొల్లు వీరగణేష్, కొప్పన కోటేశ్వరరావు, ఇనుముల రాజా, దిడ్డి రాజుబాబు, పెదబాబు పాల్గొన్నారు.

రేపు ఛలో అసెంబ్లీని జయప్రదం చేయాలి

పెద్దాపురం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 6న నిర్వహించే ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా జయప్రదం చేయాలని సర్పంచ్‌ల సమాఖ్య పెద్దాపురం నియోకవర్గ అధ్యక్షుడు తోట రామకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక విలేఖరులతో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లకు పరిష్కారం చూపాలని 6న అసెంబ్లీని ముట్టడించనున్నట్టు పేర్కొన్నారు. కేంద్రం అందించిన ఆర్థిక సంఘ నిధులు వైసీపీ ప్రభుత్వం కాజేసిదని, వెంటనే సర్పంచ్‌ల ఖాతాలకు జమచేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలకు రూ.15 వేలు, జడ్పీటీసీ, ఎంపీపీలకు రూ.30 వేలు వంతున గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఈ సభకు జిల్లాలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు తరలిరావాలని ఆయన కోరారు.

సామర్లకోట: మండలంలోని సర్పంచ్‌లందరూ ఛలో అసెంబ్లీకి తరలిరావాలని రాష్ట్ర తెలుగుయువత ప్రధాన కార్యదర్శిపనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్ కోరారు.

బీజేపీ బూత్ కమిటీల సమావేశం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: మండలంలోని ధర్మవరం రాజగోపాలస్వామి ఆలయంలో ఆదివారం బీజేపీ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కందా వీరస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈనెల 9,10,11న నిర్వహించే బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ కాకినాడ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, జిల్లా కమిటీ సభ్యులు గున్నాబత్తుల రాజబాబు, మండల నాయకులు ఇంటి బాబురావు, మాగాపు శివ సత్యనారాయణ,మంగరాజు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల సమావేశం

జగ్గంపేట, ఫిబ్రవరి 4: క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ నేతలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు సమాయత్తం కావడానికి ఈనెల తొమ్మిది నుంచి 11 వరకు పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాశీ విశ్వనాథరాజు, సుధ, సూర్యనారాయణరాజు, రామ్‌కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీనాయుడికి సాహిత్య ప్రతిభా పురస్కారం

పిఠాపురం, ఫిబ్రవరి 4: పట్టణానికి చెందిన కవి, సాహిత్యవేత్త డాక్టర్ కిలారి గౌరీ నాయుడికి యువ సాహిత్య ప్రతిభా పురస్కారం లభించింది. విశాఖపట్టణంలోని అంకితం వెంకట నరసింగరావు ఆడిటోరియంలో డాక్టర్ రాచకొండ నరసింహశర్మ సాహిత సంస్థ ప్రతినిధులు గౌరీనాయుడికి ఈ పురస్కారం అందజేసి సత్కరించారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక కళారంగాల్లో చూపుతున్న ప్రతిభకు ఈ పురస్కారం అందిస్తున్నట్టు సంస్థ గౌరవాధ్యక్షుడు ఎంఎస్ నాయుడు, ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారి, కన్వీనర్ పి.వెంకటరత్నం, కోశాధికారి గాయత్రి తెలిపారు. నాయుడిని డాక్టర్ ఆవంత్స సోమసుందర్ లిటరరీ ట్రస్టు ప్రతినిధులు, సాహిత్యవేత్తలు అభినందించారు.

భారత వికాస పరిషత్ స్టేట్ కౌన్సిల్ సమావేశం

తుని రూరల్, ఫిబ్రవరి 4: భారత వికాస పరిషత్ స్టేట్ కౌన్సిల్ సమావేశం తుని కన్యాకాపరమేశ్వరి ఆలయంలో జరిగింది. స్థానిక బీవీపీ అధ్యక్షుడు బి.లక్ష్మణాచార్యులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాతీయ భారతీయ వికాస పరిషత్ చైర్మన్ ధూళిపాళ్ళ పురుషోత్తమ శాస్త్రి హాజరై మాట్లాడారు. బీవీపీ 61 ఏళ్ల మహావట వృక్షాన్ని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత అందరిపై ఉందన్నారు. భారత్ స్పర్శ, సేవలు మరింత విస్తృతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఎంవీ సూర్యనారాయణరాజు, వి.సన్యాసిరావు, ఆంజేయ ప్రసాద్, వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ర్యాలీ

తాళ్లరేవు, ఫిబ్రవరి 4: చొల్లంగిలో ఇళ్ల స్థలాలను స్థానిక లబ్ధిదారులకే ఇవ్వాలని కోరుతూ ఆదివారం వారు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నేత కట్టా త్రిమూర్తులు మాట్లాడుతూ చొల్లంగిలో ఉన్న లబ్ధిదారులకు నివాసయోగ్యంలేని ప్రాంతాల్లో అడవులకు దగ్గరగా ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసి చొల్లంగిలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: గేమ్ ఆన్ , అంబాజీపేట మ్యారేజిబ్యాండు, గుంటూరు కారం, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, హైండవ్, గుంటూరు కారం, కెప్టెన్ మిల్లర్, అంబాజీపేట మ్యారేజిబ్యాండు, గేమ్ఆన్

తిరుమల	:	ధీర
లక్ష్మి	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సీ అండ్‌సీ1	:	బూట్‌కట్ బాలరాజు
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	అంబాజీ మ్యారేజిబ్యాండు

16న రథసప్తమి వేడుకలు

పెద్దాపురం, ఫిబ్రవరి 4: స్థానిక వర్ధుల వారి వీధిలో వేంచేసి ఉన్న భువనేశ్వరీ పీఠంలో ఈనెల 16న రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సూర్యనమ స్కారములు, అభిషేకములు తదితర పూజాధికాలు నిర్వహించడం జరుగు తుందని, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పూజాధికాల్లో పాల్గొనదలినవారు 9866193557లో సంప్రదించాలని కోరారు.

జగన్ పాలనతో విసిగిపోయిన ప్రజలు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



పిఠాపురంలో టీడీపీలో చేరినవారితో వర్మ



తుని రూరల్: టీడీపీలో చేరినవారితో కృష్ణుడు

పిఠాపురం, ఫిబ్రవరి 4: జగన్‌రెడ్డి విధ్వంసకర పాలనతో విసిగివేశారిన ప్రజలు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు జగన్ సిద్ధంగా ఉండాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం యానాదుల కాలనీలో ఆదివారం రాత్రి కాదా రాజు మిత్రబృందం 150మంది వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వారందరికి వర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూల్చివేతలు, నిర్బంధాలు, అణిచివేతలు తప్ప అభివృద్ధి అనేది కనబడడం లేదన్నారు. అన్నివర్గాల ప్రజలు వైసీపీ పాలనతో అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాల పేరుతో పది రూపాయిలు ఇచ్చి 100 రూపాయిలు లాక్కుంటున్నారని విమర్శించారు. యానాదుల కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, తాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. కాలనీల్లో ఇళ్లపట్టాలపై నివాసముంటున్న వారి పేర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ అధికారంలోకి రాగానే వాటిన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ఎల్లప్పుడు అండగా ఉండే తనను ఆశీర్వదించాలని వి జ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, కొండేపూడి ప్రకాష్, దేవరపల్లి రామారావు, పిల్లి చిన్నా, నామా దొరబాబు, సోము సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, అల్లవరపు నగేష్, వార్డు చెరుకూరి రాంబాబు, మర్రి సత్తిబాబు, మహేష్, కందే అయ్యన్న, మేకల రమణ, లోవరాజు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద జగ్గంపేట మండలం కాండ్రేగుల, కిర్లంపూడి గ్రామం గెద్దనాపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, సీనియర్ నేత రామిశెట్టి చంద్రరావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యురాలు నదేదుర్గ, ఉప్పులూరి రాఘవ రావు, కామన రామ్మూర్తి, కొలిమి రాంబాబు, తోటకూర తాతారావు, కంద వెంకటేశ్వరు తదితర 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ టీడీపీ కండువాలతో స్వాగతం పలికారు. గెద్దనాపల్లికి చెందిన వైసీపీ నాయకులు శీతాల కొండబాబు, ఆకుల అన్నబాబు, వల్లూరి భాస్కరరావు, దేవన జోగిరావు, ఈపు రాంబాబు యాదవ్, పూసల శేఖర్, నీలు పాండురంగ, సీతాల చిన్న నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బీశెట్టి రాంబాబు, ఇనకోట దొరబాబు, సప్పతాతీలు, బసకల తాతాజీ, సాపిరెడ్డి దొరబాబు, పెట్ల ప్రసాద్, పెట్ల చినబాబు, కొప్పిన రాబు నెహ్రూకు సంఘీభావం తెలిపారు. అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుని రూరల్: అవినీతి అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన వైసీపీ పాలకులకు కాలం చెల్లిందని రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు స్పష్టం చేశారు. తొండంగి మండలం ఒంటిమామిడి పంచాయతీ పరిధిలోని పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరగా కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పి.సత్యనారాయణ, పంపన బోయిన శ్రీను, జెగ్గం సత్యనారాయణ, పారేపల్లి సత్యనారాయణ, సారెపల్లి తాతారావు, రాంబాబు, ఈశ్వరరావు, పలు కుటుంబాలు టీడీపీలో చేరినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, రాష్ట్ర రైతు కమిటీ కార్యనిర్వహణ కార్యదర్శి పేకేటి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీ, పేకటి యజమాని, రాజన రామకృష్ణ ఉన్నారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం వైసీపీ నాయకులు, లింగంపర్తి మాజీ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌జీబీ సుబ్బరాజు(బ్యాంక్ రాజు) వైసీపీకి గుడ్‌బై చెప్పారు. లింగంపర్తిలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభరాజా రాజుకు పార్టీ కుండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయతో పాటు లింగంపర్తిలోని మరో 100 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలోకి చేరడంతో వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. లింగంపర్తి వైసీపీ వార్డు మెంబర్ బొండు వీరబాబు, మాజీ వార్డు మెంబర్లు నడిగట్ల ఈశ్వరుడు, తమ్మిన రాంబాబు, నాయకులు అలమండ సత్తిబాబు, బి.సత్తిబాబు, ఎస్.నూకరాజు, ఎం.నాని, పి.రాంబాబు, ఎం.వెంకటేశ్వర్లు, చదల మురళి, పి.తాతారావు, చక్రి, తాతీలు టీడీపీలో చేరినవారిలో ఉన్నారు. జ్యోతుల పెదబాబు, సూది బూరయ్య, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నూకతాటి ఈశ్వరుడు, సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, బొదిరెడ్డి గోపి, ఎంఎస్ స్వామి, పైలా సాంబశివరావు, ఎంపీపీ గంటుమళ్ళ రాజ్యలక్ష్మి, డాక్టర్ విజయబాబు, వెన్నా శివ, పలివెల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, బచ్చల శివ పాల్గొన్నారు.



ప్రత్తిపాడు: టీడీపీలోకి ఆహ్వానిస్తున్న నవీన్, సత్యప్రభ

'ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి'



జ్యోతుల నవీన్‌కు వినతిఇస్తున్న ఎస్టీయూ నాయకులు

కాకినాడరూరల్, ఫిబ్రవరి 4: ఎస్టీయూ రాష్ట్రసంఘం పిలుపుమేరకు ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలను వివిధ రాజకీయపార్టీల ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ రాజకీయపార్టీల జిల్లాస్థాయి అధ్యక్షులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాలను ఆదివారం అందజేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు, జీవో 117ను రద్దు, 12వ పీఆర్సీ అమలుచేయాలని, ఐఆర్ 30శాతం ఇవ్వాలని ఉపాధ్యాయులకు పదవీవిరమణ వయస్సును 62కు పెంచాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, రూరల్ ఎమ్మెల్యే కురసాలకన్నబాబు, బీజేపీ కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు గడ్డి సత్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.మధు, ఆప్ రాష్ట్రసంయుక్త కార్యదర్శి రామారావులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మోర్త శ్రీనివాస్, కుసుమంచి కాశీ విశ్వనాద్, ఆర్థిక కార్యదర్శి శెశెట్టి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాజు, శ్రీనివాసరావు, కిరణ్మయి, రామకృష్ణ ఉన్నారు.

పోటీ పరీక్షలపై అవగాహన



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీలు

సామర్లకోట, ఫిబ్రవరి 4: గ్రూప్ 1, 2 ఏపీపీ ఎస్సీ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగ యువతకు గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో సామర్లకోట చక్కెర అతిథి గృహం ఆవరణలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఫ్యాకల్టీలు కాకర ముత్యాలరావు, వైబోగుల గోపాలకృష్ణ, తాతపూడి సుశీల్ కుమార్ ప్రశ్నాపత్రాలకు చెందిన టిప్స్‌ను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు ఇళ్ళ వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణరావు హాజరయ్యారు. నిరుద్యోగ యువతకు అవగాహనా సదస్సులు నిర్వహించేందుకు ముందుకు రావడమే గాక విలువైన స్టడీ మెటీరియల్‌ను అందించిన గుణ్ణం చంద్ర మౌళి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. అభ్యర్థులకు గుణ్ణం చంద్రమౌళి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఫ్యాకల్టీలను సత్కరించారు. అభ్యర్థులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, తేనీటి విందు, భోజనాలను చంద్ర మౌళి ఛారిటబుల్ ట్రస్ట్ అందజేసింది. కార్యక్రమాన్ని డాక్టర్ నందకిశోర్, డాక్టర్ మోహన్, గుణ్ణం వీరభద్రరావు,గుణ్ణం సురేష్ పర్యవేక్షించారు.

భవన నిర్మాణానికి విరాళం

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 4: ది గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవన నిర్మాణానికి ది కాకినాడ ఫంక్షన్ మెటీరియల్ సప్లయర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రూ.15లక్షల విరాళాన్ని అందజేశారు. ఎస్ఎఫ్‌సీఎల్‌లో నూతనంగా నిర్మిస్తున్న భవనం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ది గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ మూడో అంతస్తు నిర్మాణానికి తమ సంస్థ పేరు పెట్టాలని కోరుతూ విరాళాన్ని అందజేస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు మాచర్ల వేణుబాబు తెలిపారు. జాయింట్ కార్యదర్శి యడ్లపల్లి వేణునాథరావు మాట్లాడుతూ విరాళాన్ని తమ సంస్థ గౌరవాధ్యక్షుడు నారాయణదాస్‌భూప్, మాజీ అధ్యక్షుడు ఎక్కల ప్రసాద్ నిధులు సమకూర్చి అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సప్లయర్స్ అసోసియేషన్ కార్యదర్శి బొడ్డు బాపిరాజు, కోశాధికారి వి.రాంబాబు, ఛాంబర్ కార్యదర్శి దాసరి సాయికృష్ణ, కోశాధికారి పూర్ణచంద్రరావు, గమిని సత్యం పాల్గొన్నారు.



రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి



సర్పవరం జంక్షన్: వాకలపూడిలో పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 4: సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాశీస్సులతో అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ అన్నారు. ఆదివారం సూర్యారావుపేట లైట్‌హౌస్ ప్రాంతంలో జనసేన-టీడీపీ నాయకులతో కలసి జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి, కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు రాందేవు సీతయ్యదొర, కరెడ్ల గోవిందు, మాజీ సర్పంచ్ యజ్జల బాబ్జీ, సోదె మునలయ్య, సింహాద్రి, శోభన్‌బాబు, ఎల్లబోయిన రామకృష్ణ, గరికిన సురేష్ పాల్గొన్నారు. వాకలపూడి ఎఫ్‌సీఐ కాలనీ, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన కొల్లుబోయిన శ్రీనివాస్, గంటా ప్రసాద్, గేదెల చిన్నారావుల ఆధ్వర్యంలో సుమారు 25 మంది యువత జనసేనలో చేరగా వారికి నానాజీ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కుండల మణికంఠ, పల్లేటి సతీష్, న్యాయవాది విక్రమ్, కర్రి లక్ష్మి ఉన్నారు.

జనసేనలో చేరికలు

కరప, ఫిబ్రవరి 4: వివిధ పార్టీలకు చెందిన నేతలు జనసేనలో చేరారు. నడకుదురు కమిటీ అధ్యక్షుడు భాస్కర్ తమ్మయ్య, గొల్లపల్లి చంద్రశేఖర్, గోవిందు, పడాల ఈశ్వర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి పీఏసీ సభ్యుడు పంతం నానాజీ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బండారు మురళి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడరూరల్: రూరల్ మండలం ఇంద్రపాలెం అర్జున్‌నగర్‌లో జనసేన పార్టీ గ్రామనాయకులు గవర శ్రీరాములు, తాటికాయల రమేష్, రమణ ఆధ్వర్యంలో 100 మంది వైసీపీ నాయకులు జనసేనలో చేరగా కాకినాడరూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంతం నానాజీ పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శిరంగు శ్రీనివాసరావు, నక్కా శ్రీను, మహేష్, అప్పారావు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల మెరుగుపై దృష్టి పెట్టాలి



ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్న వాసంతి

అదనపు జిల్లా జడ్జి వాసంతి

పిఠాపురం, ఫిబ్రవరి 4: విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్న తీరు పట్ల 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాప్రమాణాల మెరుగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పిఠాపురం ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ వసతిగృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాప్రమాణాలు, హాస్టల్లో వసతులు, కల్పిస్తున్న సౌకర్యాలు, బోజనాలు తదితర అంశాలపై విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులకు పెడుతున్న అన్నం, కూర తదితరాలను రుచి చూశారు. వసతి గృహంలో సౌకర్యాలు మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆమె వెంట న్యాయవాది ఎస్‌కే అబ్రహార్, వసతి గృహ సంక్షేమాధికారిణి లతామోహన్ పాల్గొన్నారు.

సెస్ నిధులను కార్మికులకే ఖర్చు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: భవన నిర్మాణాల సమయంలో వసూలు చేసే సెస్ నిధులను భవన నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు రూ.5 కోట్లు నిధులు తక్షణం మంజూరు చేయాలని కాకినాడ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. కాకినాడ అశోక్‌నగర్ వద్ద ఆదివారం పీజీఆర్ కుమార్ అధ్యక్షతన జరిగిన యూనియన్ సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రసాద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు భద్రత కరువైందని, ఉపాధి లేకుండా పోతుందన్నారు. కార్మికులు ప్రమదాలకు గురై కాలు, చేయి విరిగిన, సహజ మరణాలు సంభవించిన, యాక్సిడెంట్ అయిన ప్రభుత్వం నుంచి ఒక రూపాయి కూడా మంజూరు కావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈనెల 7న సామర్లకోటలో జరగనున్న భవన నిర్మాణ కార్మికుల, ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశాల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో టి.అన్నవరం, శ్రీను, ఎ.శివ, అచ్చారావు, కుమార్, ఉలిశెట్టి విజయ భాస్కర్, బండారు రాజశేఖర్ పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌ని జయించవచ్చు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 4: క్యాన్సర్‌పై భయాందోళనలు విడనాడాలని, అవగాహనతో క్యాన్సర్‌ని జయించి ఆరోగ్యవంతంగా జీవించవచ్చని అదనపు ఎస్పీ సత్యనారాయణ, జీజీహెచ్ కేన్సర్ హెచ్‌వోడీ డి.శ్రీనివాసులు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ట్రినిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి వరకు విద్యార్థులు, డాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. సమాజంలో వయసుతో సంబంధం లేకుండా క్యాన్సర్ బారిన పడుతున్న రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ర్యాలీ నిర్వహించిన ట్రినిటీ హాస్పిటల్ నిర్వాహకులను అభినందించారు. క్యాన్సర్‌పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలని, ముందస్తుగా గుర్తిస్తే నియంత్రించే మందులు ఉన్నాయన్నారు. డాక్టర్ కౌశిక్ విజయబాలు, యాళ్ల రాజా, ముత్యాల మురళీ, అడబాల సత్యనారాయణ, పేకేటి శైలేంద్ర, కిషోర్ ఉన్నారు.

ఘనంగా భద్రాచల రథ పాదయాత్ర

సామర్లకోట, ఫిబ్రవరి 4: సీతారామ చంద్ర స్వామి దివ్య రథోత్సవ 13వ వార్షికోత్సవ పాదయాత్రను ఆదివారం సామర్లకోట మండలం అచ్చంపేట నుంచి ఘనంగా ప్రారంభమైంది. వాసుదేవ గురుస్వామి నేతృత్వంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప రథం ముందు కొబ్బరికాయ కొట్టి యాత్రను ప్రారంభించారు. వాసుదేవ గురుస్వామి, వింటి బాబ్జీ మాట్లాడుతూ 200మంది వృద్ధ మహిళలు, 100 మంది పురుషులు పాదయాత్రలో పాల్గొంటున్నారన్నారు. 9రోజుల పాటు పాదయాత్ర చేసి భద్రాచల సీతారామచంద్రులవారి దర్శనంచేసుకుని తిరుగుపయనం అవుతామన్నారు. సామర్లకోట గ్రామదేవత నూకాంబికా ఆలయం వద్ద ఆలయ కమిటీ అందించిన అల్పాహారాన్ని స్వీకరించి తిరిగి పెద్దాపురం మీదుగా రథోత్సవ పాదయాత్ర కొనసాగింది.

జనసేన బైక్ ర్యాలీ

కొత్తపల్లి, ఫిబ్రవరి 4: మండలంలో పలు గ్రామాల్లో జనసైనికులు ఆదివారం మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయం నుంచి బైక్‌లపై ర్యాలీగా బయలుదేరి వాకతిప్ప, కుతుకుడుమిల్లి, రవీంద్రపురం, ఉప్పాడ మీదుగా తీరప్రాంతాల గుండా ర్యాలీ సాగింది. రాబోయే ఎన్నికల్లో జనసేన,టీడీపీ బలపర్చిన అభ్యర్థినే ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. జనసేన పార్టీ నాయకుడు గవర రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రాష్ట్ర నాయకుడు దాసరి కిరణ్, కొణమర్తి రాంబాబు, సానా నాగు, మత్సా అప్పాజీ, దొడ్డి శ్రీనివాస్ పెద్ద ఎత్తున జనసైనికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

జగ్గంపేట, ఫిబ్రవరి 4: ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని ఇర్రిపాకలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. మర్రిపాక, ఇర్రిపాక రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఇర్రిపాక సర్పంచ్ త్రిరిదేవి, రామవరం సర్పంచ్ వత్సవాయి సత్యనారాయణరాజు, గణేశుల రాంబాబు, సంజీవ్, వంటిపల్లి రామన్నదొర, జ్యోతుల స్వామి పాల్గొన్నారు.

'నిందితులను అరెస్టు చేయాలి'

రౌతులపూడి, ఫిబ్రవరి 4: విశాఖపట్నం సనపల రూరల్ తహశీల్దార్ రమణయ్యను అతి కిరాతకంగా ఇనుపరాడ్లతో కొట్టిచంపడం దారుణమని మండల టీడీపీ యువనేతలు గంటా గోపి, అల్లు బుజ్జీ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ హత్య కేసులో నిందితులను తక్షణం గుర్తించి అరెస్టు చేయాలన్నారు. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ హోదా కలిగిన తహశీల్దార్‌కి రక్షణ లేకుండా పోయిందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అధికారులపై దాడులు జరుగుతూనేఉన్నాయని, సరైన రక్షణలేకపోతే పనులు చేయడానికి భయపడతారన్నారు.

ఘనంగా రావులమ్మ సంబరం

జగ్గంపేట, ఫిబ్రవరి 4: రావులమ్మ తల్లి అమ్మవారి సంబరాన్ని ఆదివారం పద్మనాభ నగర్ కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అనంతరం గ్రామంలో ప్రాంతాల్లో రాళ్శంతల సంబరాలు జరుపుకోవడం పరిపాటిగా వస్తున్నది. దీనిలో భాగంగా జగ్గంపేటలో ఆఖరి సంబరాన్ని ఆదివారం నిర్వహించారు. కుటుంబాలంతా అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

తల్లిదండ్రులకు బిడ్డ అప్పగింత

జగ్గంపేట, ఫిబ్రవరి 4: గోకవరం రోడ్డులో జగ్గంపేట నెహ్రూ కాలనీ సమీపంలో ఒక చర్చి వద్ద తమ బిడ్డను బాగా చూసుకోలేకపోతున్నామని లెటర్ రాసిపెట్టి బిడ్డను విడిచిపెట్టి వెళ్లారు. జగ్గంపేట పోలీసులు బాబు తల్లిదండ్రులు వివరాలు తెలుసుకుని ఆదివారం వారికి అప్పగించారు. మరోసారి ఇలా చేయవద్దని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: ప్రత్తిపాడు గోవిందరాజు చెరువు గట్టుపై గత సత్యసాయి మందిరంలో ఆదివారం కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాయిత్రిమంత్రాలు పఠనం, భజన గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా విద్యాజ్యోతి కో ఆర్డినేటర్ సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ అవార్డు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 4: ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. రీజనల్‌స్థాయిలో ఆదివారం అనకాపల్లిలో నిర్వహించిన లయన్స్ క్లబ్ సమావేశంలో పూసర్ల సుధీర్, పూసర్ల సుధాలక్ష్మి దంపతులు ఈ అవార్డును స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్‌కు అందజేశారు. రీజనల్ పరిధిలో ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ చేపడుతున్న సామాజికసేవా కార్యక్రమాలను చైర్మన్ అభినందించారు. ప్రత్తిపాడు లయన్స్ పాస్ట్ అధ్యక్షులు పంతం సూరిబాబు, పంతం కృష్ణ, పిల్లా పద్మరాజు తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి, ఫిబ్రవరి 4: మండలంలో నీలాద్రిపేట గ్రామంలో ఆదివారం యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి రూ.2లక్షలు ఉచిత బీమా కల్పిస్తున్నట్లు ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కందుల చిట్టిబాబు, ముళ్ళంపాక సురేష్ పలువురు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తుని రూరల్, ఫిబ్రవరి 4: తునిలోని సత్యసాయి సేవా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 125 మందికి వైద్య పరీక్షలు చేశారు. 40 మందికి ఆపరేషన్లు అవసరం కాగా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని నిర్వాహకుడు డాక్టర్ చారి తెలిపారు.

తహశీల్దార్‌కు సన్మానం

కరప, ఫిబ్రవరి 4: తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆయనకు ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. సర్వేయర్ రామకృష్ణ, వైద్యాధికారి శ్రీనివాస నాయక్, రీసర్వే సురేష్‌కుమార్, ఆర్ఐ మాచరావు తదితరులు పాల్గొన్నారు.